# ధర్నాలతో దద్దరిల్లిన తెలంగాణ

# ఇదేనా ప్రజాపాలన?

## • వస్త్ర పరిశ్రమకు ఉచిత విద్యుత్తు అందించాలి



సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఉచిత విద్యుత్తు అందించాలని పవర్‌లూమ్ వస్త్ర పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల సమాఖ్య(జేఏసీ) నాయకులు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేదాకా పోరాటం ఆగదని స్పష్టం చేశారు. నిరాహార దీక్షకు మద్దతుగా మంగళవారం సిరిసిల్లలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో, 25న సిరిసిల్ల పట్టణ బంద్, 26న చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ తెలిపారు. చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, కాటన్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఆసాముల సంఘం అధ్యక్షుడు రవీందర్, డయింగ్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

*- సిరిసిల్ల టౌన్, జూలై 22*

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఆశ కార్యకర్తల నిరసన • సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ల వద్ద ధర్నా

నమస్తే నెట్‌వర్క్, జూలై 22: ఇదేనా ప్రజాపాలన అంటూ.. కాంగ్రెస్ సర్కారు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆశ కార్యకర్తలు సోమవారం ఆయా జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రజాపాలన పేరు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ తమ సమస్యలను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం రూ.18 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ పిలుపు మేరకు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని కలెక్టరేట్ ఆఫీసుల ఎదుట కదం తొక్కారు. కరీంనగర్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ముకుందరెడ్డి, జిల్లా కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు. జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి వినతి పత్రాన్ని కలెక్టర్ బీఎం సంతోష్‌కు అందజేశారు. నల్లగొండ, భువనగిరి కలెక్టరేట్ల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరారెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు



## • మత్స్యకార్మికుల ఆందోళన

సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మత్స్యకార్మిక సంఘం నాయకులు సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మత్స్య కార్మిక సంఘం నేత శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ-ఏ గ్రూపునకు మార్చి మత్స్యకారులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు అల్లోజీ పాల్గొన్నారు.

*- కోడేరు, జూలై 22*



## • బురద రోడ్డుపై నాట్లేసి నిరసన

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్‌లో ప్రధాన రహదారి బురదమయంగా మారింది. వివిధ పాఠశాలలకు వెళ్లే మార్గం ఇదే కావడంతో నిత్యం పదుల సంఖ్యలో విద్యార్థులు, స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డంతా చిత్తడిగా మారింది. రహదారి ఇలా ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని సోమవారం స్థానిక బీజేపీ నాయకులు బురదలో వరి నాట్లు వేసి నిరసన తెలియజేశారు. వెంటనే మరమ్మతులు చేయడంతోపాటు సీసీగా మార్చాలని డిమాండ్ చేశారు.

*- కల్వకుర్తి, జూలై 22*

## • షరతుల్లేకుండా జీవనభృతి ఇవ్వాలి

తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా బోధన్‌లో బీడీ కార్మికులు సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎలాంటి షరతుల్లేకుండా అమలు చేయాలని, జీవనభృతిని రూ.4 వేలకు పెంచుతామన్న మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జీవనభృతి మొత్తాన్ని పెంచకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

*– శక్కర్‌నగర్, జూలై 22*



## • 'డబుల్' ఇండ్ల లబ్ధిదారుల ధర్నా



నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని డబుల్ బెడ్రూం ఇండ్లు అప్పగించాలని లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. పట్టణంలోని యూటీఎఫ్ భవనం నుంచి పాలమూరు రోడ్డు చౌరస్తా మీదుగా డబుల్ బెడ్రూం ఇండ్ల వరకు ర్యాలీ చేపట్టి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ కల్వకుర్తి శివారులోని సర్వేనంబర్ 99లో కేసీఆర్ ప్రభుత్వం 220 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించిందన్నారు. ప్రభుత్వం మారడంతో ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో ఏపీ మల్లయ్య, బాల్‌రెడ్డి, కిశోర్ పాల్గొన్నారు. *- కల్వకుర్తి రూరల్, జూలై 22*



## • వడ్డెరులను ఎస్టీలో చేర్చాలి

ఎన్నికల హామీ మేరకు వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ వ డ్డెర సంఘం, చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించకపోతే అసెంబ్లీ, సీఎం కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఒక్క రోజు నిరాహారదీక్ష చేపట్టారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేశ్, వైస్ చైర్మన్ దేవరాజ్ ఉన్నారు.

*-చిక్కడపల్లి, జూలై 22*

## • ఫీజు బకాయిలు విడుదల చేయాలి

భువనగిరి అర్బన్, జూలై 22 : ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ భువనగిరిలో సోమవారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రిన్స్ చౌరస్తా వరకు ర్యాలీ తీసి, రాస్తారోకో చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోదీరాందేవ్ మాట్లాడుతూ బడ్జెట్‌లో కొఠారి కమిషన్ చెప్పినట్లు విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇవే డిమాండ్లతో సూర్యాపేట, హుజూర్‌నగర్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ తీసి నిరసన తెలిపారు. మిర్యాలగూడలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు.



## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- ట్రాన్స్‌ఫార్మర్ తీగలు పట్టుకుని మృతి
- నిర్మల్ జిల్లా పల్సి తండా వద్ద ఘటన

కుభీర్, జూలై 22: కూతురు పెండ్లి, ఇల్లు కట్టడానికి చేసిన అప్పులు ఎకరన్నర భూమి అమ్మినా తీరలేదని ట్రాన్స్‌ఫార్మర్ తీగలు పట్టుకుని రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లా కుభీర్ మండలం సిర్పెల్లి(హెచ్)లో చోటు చేసుకున్నది. కుభీర్ ఏఎస్సై శివయ్య తెలిపిన ప్రకారం.. సిర్పెల్లి(హెచ్) గ్రామానికి చెందిన జాదవ్ మారుతి(45) ఐదున్నరెకరాల భూమిని సాగు చేసుకుంటూ, ఆటో నడుపుతున్నాడు. రెండేళ్ల క్రితం కూతురి పెండ్లికి రూ.10 లక్షలు, ఇల్లు కట్టడానికి రూ.12 లక్షల అప్పు చేశాడు. వడ్డీతో కలుపుకుని రూ.25 లక్షల వరకు అప్పు అయింది. తనకున్న ఐదున్నరెకరాల్లో ఎకరంనర భూమి అమ్మగా వచ్చిన రూ.12 లక్షలతో కొంత అప్పు తీర్చాడు. రూ.13 లక్షల అప్పు తీర్చడానికి మిగిలిన నాలుగెకరాలు అమ్మితే కొడుకుకు భూమి ఎలా అని మదనపడి సోమవారం పల్సి తండాకు వెళ్తున్నానని ఇంట్లో భార్యకు చెప్పి ఆటో తీసుకుని వెళ్లాడు. పల్సి తండా సమీపంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ టాన్స్‌ఫార్మర్ తీగెలను పట్టుకుని మృతిచెందాడు. చేలలో పని చేస్తున్న రైతులు గమనించి మారుతి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. భార్య జాదవ్ లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఏసీబీకి చిక్కిన దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్

- ఇంజక్షన్ ఆర్డర్‌పై కౌంటర్ దాఖలుకు డబ్బుల డిమాండ్

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 22 : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీ కమిషనర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికాడు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... రాంనగర్‌కు చెందిన సుదర్శన్‌కు మున్సిపాలిటీ పరిధిలోని బండ్లగూడలో ఉన్న రైస్ మిల్ స్థలం ఎదుట ఉన్న ప్రభుత్వ భూమిలో పక్కన ఉన్న వ్యక్తి ప్రహరీని నిర్మించారు. ఆ ప్రహరీని గతంలో అధికారులు కూల్చివేశారు. అయితే ప్రహరీని నిర్మించిన వ్యక్తి కోర్టు నుంచి అనుమతి తెచ్చుకొని, ప్రహరీని మళ్లీ నిర్మించాడు. కోర్టును ఇచ్చిన ఆర్డర్‌ను రద్దు చేసేందుకు మున్సిపాలిటీ తరుపున కౌంటర్ దాఖలు చేయాలని మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యను సుదర్శన్‌ను కలిశారు. ఇందుకు రూ.50లు చెల్లించాలని కమిషనర్ సుదర్శన్‌ను డిమాండ్ చేశారు. ఇరువురి మధ్య కుదిరిన ఒప్పందం మేరకు మొదట ఆయన కమిషనర్‌కు రూ.20వేలు ముట్టచెప్పాడు. మిగతా రూ.30వేలు కూడా ఇస్తేనే కౌంటర్ దాఖలు చేస్తామని డిమాండ్‌కు దిగారు. దీంతో సుదర్శన్ రంగారెడ్డి జిల్లా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అధికారుల సూచన మేరకు సోమవారం రసాయనాలు వినియోగించిన రూ.500 నోట్లను సుదర్శన్ కమిషనర్‌కు అందజేశారు. ఆ వెంటనే ఏసీబీ అధికారులు రంగం ప్రవేశం చేసి, కమిషనర్‌ను పట్టుకున్నారు. అతడి చేతులకు రసాయనిక పరీక్షలు నిర్వహించి, లంచం డబ్బులు తీసుకున్నట్టు తేలింది. డబ్బులను రికవరీ చేసి, నాంపల్లిలోని ఏసీబీ కేసులను విచారించే కోర్టు అడిషనల్ జడ్జి ఎదుట ప్రవేశపెట్టారు.




లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన దమ్మాయిగూడ మున్సిపాలిటీ కమిషనర్ రాజమల్లయ్య




## • స్కాలర్‌షిప్స్ విడుదలకు ఎస్ఎఫ్ఐ ధర్నా


రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న రూ.730కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆమన్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం లేక చెట్ల కింద చదువులు సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్షుడు ప్రణయ్, కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షులు చరణ్, శివ, శ్రీకాంత్, తరంగ్, సహాయ కార్యదర్శులు శ్రీకాంత్, సంధ్య, స్టాలిన్, ఆరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

*- రంగారెడ్డి, జూలై 22(నమస్తే తెలంగాణ):*

## • విద్యాబోధనకూ ఇక్కట్లే..

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ఉర్దూ మీడియం)లో 485 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి గదులు సరిపోక వరండాలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. అన్ని తరగతులకు కలిపి కేవలం ఆరుగురు ఉపాధ్యాయులు మాత్రమే బోధనవందిస్తున్నారు. ప్రార్థనా సమయంలో స్థలం లేక, సగం మంది వరండాలో, సగం మంది చిన్నపాటి మైదానంలో నిల్చుంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, సమస్యలను పరిష్కంచాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

*-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్*



## జీవో 317 సమస్యలను పరిష్కరించాలి

- క్యాబినెట్ సబ్ కమిటీకి పీఆర్టీయూటీఎస్ వినతి

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): జీవో నంబర్ 317 అమలులో ఏర్పడిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌కు పీఆర్టీయూటీఎస్ విజ్ఞప్తిచేసింది. సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ కలిసి మంత్రులకు వినతిపత్రం అందజేశారు. వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్న భార్యాభర్తలను ఒకే జిల్లాకు కేటాయించాలని, స్థానికత ఆధారంగా ఉపాధ్యాయులను సొంత జిల్లాకు బదిలీ చేయాలని, సీనియారిటీకి రక్షణ కల్పిస్తూ పరస్పర బదిలీలను అమలు చేయాలని విజ్ఞప్తిచేశారు. క్యాడర్ స్ట్రెంత్ సరిచేయాలని, మెడికల్, వితంతు ప్రాధాన్యతలను గుర్తించాలని కోరారు. అవసరమైతే సూపర్ న్యూమరీ పోస్టులను మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ అంశాలను ప్రతిపాదనల రూపంలో ప్రభుత్వానికి సమర్పించి, ఉత్తర్వులు విడుదల చేస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్టు నేతలు తెలిపారు.

## పెండింగ్ డీఏ చెల్లించాలి: ఎస్టీయూ

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): ఆరు నెలలకొకసారి చెల్లించే కరువు భత్యం (డీఏ) రెండున్నరేండ్లుగా అమలు కావడంలేదని, తక్షణమే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం పర్వత్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి జీ సదానందంగౌడ్ ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏతోపాటు పీఆర్సీపై మంత్రిమండలిలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ ఉమ్మడి సర్వీస్ నిబంధనలు రూపొందించాలని పేర్కొన్నారు.

## మా భూమిని మాకు ఇప్పించండి

- సూర్యాపేట కలెక్టరేట్‌లో మహిళల ఆత్మహత్యాయత్నం

సూర్యాపేట, జూలై 22: కబ్జాకు గురైన భూమిని తిరిగి ఇప్పించాలని అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని ఇద్దరు మహిళలు సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేశారు. బాధితులు లక్ష్మి, అరుణ వివరాల ప్రకారం.. నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన మేడం ముత్తయ్యకు సర్వే నంబర్ 190లో 2 ఎకరాల 50 సెంట్ల భూమి ఉండగా.. ఆయన కుటుంబ సభ్యులు మేడం చిట్కయ్య, మేడం వెంకటేశ్వర్లు, మేడం బాజరమ్మకు వారసత్వంగా వచ్చింది. వారు బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తు లు కబ్జా చేసి వారి పేరు మీద పట్టా చేయించుకున్నారు. సమస్య పరిష్కారం అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని, కలెక్టరేట్‌కు మూడుసార్లు వచ్చినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు లక్ష్మి, అరుణ సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌కు పెట్రోల్ బాటిల్‌తో వచ్చి ఆత్మహత్యాయత్నం చేశారు. పోలీసులు గమనించి పెట్రోల్ బాటిల్‌ను తీసుకుని నచ్చజెప్పారు. కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్‌పవార్ వారి తో మాట్లాడారు. ఆర్డీవో, తహసీల్దార్‌తో విచారణ చేయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



సూర్యాపేట కలెక్టరేట్ ఆవరణలో ఆత్మహత్యాయత్నం చేస్తున్న మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు